# వారిప్పుడు వెనిజులాను వేటాడడానికి వస్తున్నారు

ఈ ఏడాది జనవరి చివరి వారంలో, దక్షిణ అమెరికా దేశమైన వెనిజులాలో అనూహ్యమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్లమెంటు నాయకుడిగా తాత్కాలికంగా తొలగించబడిన జువాన్ గుయిడో తనకు తానే దేశాధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. ఊహించిన విధంగానే, వెనువెంటనే అతనిని 'మధ్యంతర' అధ్యక్షునిగా అమెరికా సామ్రాజ్యవాదం గుర్తించింది. ఇదేవిధంగా ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయానికి యూరోపియన్ యూనియన్‌కు చెందిన 19 సభ్య దేశాలు, ఇతర అమెరికా మిత్రదేశాలు వెనువెంటనే సమర్థనగా నిలిచాయి. తనంతతానే దేశాధ్యక్షునిగా ప్రకటించుకున్న గుయిడో పైనకానీ లేదా అతని మద్దతుదారులపైనకానీ చట్టబద్ధంగా ఎన్నికైన వెనిజులా దేశాధ్యక్షుడు నికొలాస్ మదురో ఏవిధమైన హింసాత్మక చర్యలకు పాల్పడరాదని ట్రంప్ హెచ్చరించాడు. ఎన్నికైన దేశాధ్యక్షుడు మదురోకు మద్దతుగా దేశవ్యాపితంగా ప్రజలు వీధుల్లోకి వచ్చి భారీ ప్రదర్శనలు నిర్వహించారు. గుయిడో స్వీయ ప్రకటన తర్వాత అతనికి మద్దతుగా కొద్దిమందితో కొన్ని ప్రదర్శనలు జరిగాయి.

వెనిజులా ప్రభుత్వ ఆధ్వర్యంలోని పిడివిఎస్‌ఎ చమురు కంపెనీపై అమెరికా ఆంక్షలు విధించటంతో పాటు, అమెరికాలోని ఆ కంపెనీకి చెందిన 700 కోట్ల డాలర్ల ఆస్తులను జప్తు చేసింది. దీనితో పాటుగా, అమెరికా సూచనల మేరకు 120 కోట్ల డాలర్ల విలువైన వెనిజులాకు చెందిన బంగారాన్ని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్' స్థంబింపజేసింది. వెనిజులా నుండి పెట్రోలు దిగుమతి చేసుకోరాదని ఇతర దేశాలను కూడా అమెరికా బెదిరించింది. వెనిజులా ఆర్థికవ్యవస్థను ఊపిరి సలపకుండా చేసి లొంగ దీసుకోవటమే అమెరికా లక్ష్యమనేది స్పష్టం.

ఇప్పటివరకు, ఈ తిరుగుబాటు ప్రయత్నానికి వెనిజులా సైనిక బలగాల నుండి ఏవిధమైన సహకారమూ లభించలేదు; వెనిజులా సైన్యమంతా మదురో వెనక దృఢంగా నిలిచి వుంది.

ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలోని 39 మంది సభ్యులలోని 19 మంది సభ్యులు వెనిజులా విదేశీ జోక్యాన్ని తిరస్కరించారు. మదురోనే వెనిజులా యొక్క రాజ్యాంగబద్ధ అధ్యక్షుడు అని ఐక్యరాజ్యసమితి సాధారణ మండలి పునరుద్ఘా టించింది. రష్యా, చైనా, టర్కీ, ఇరాన్ వంటి దేశాలు, వెనిజులా మిత్రదేశాలైన క్యూబా బొలీవియా వంటి దేశాలు అమెరికా తీసుకున్న చర్యలను ఖండించి, దాని జోక్యాన్ని వ్యతిరేకించాయి.

15 ఆఫ్రికా దేశాలతో కూడిన 'దక్షిణ ఆఫ్రికా అభివృద్ధి సంఘం' (ఎస్ఎడిసి) ఒక ప్రకటన చేస్తూ అమెరికా మద్దతుతో వెనిజులాకు వ్యతిరేకంగా కొనసాగుతున్న తిరుగుబాటు చర్యలు అంతర్జాతీయ న్యాయసూత్రాల ఉల్లంఘనేనని పేర్కొంది. అమెరికా మద్దతుతో సాగుతున్న తిరుగుబాటు లేదా సైనిక జోక్యం వంటివాటిని ప్రక్కబెట్టి, శాంతిని పునరుద్ధరించటానికి ప్రభుత్వానికి విపక్షానికి మధ్య చర్చలను పునఃప్రారంభించాలని మదురో పదే పదే ప్రకటనలు చేసి వున్నాడు.

మరోవైపున అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎన్నికైన వెనిజులా దేశాధ్యక్షుడు మదురోను హెచ్చరిస్తూ అనేక ప్రకటనలు చేశాడు. సైనిక జోక్యాన్ని కూడా తాను కొట్టిపారేయటంలేదన్నాడు. మదురో ప్రభుత్వంతో చర్చలు జరిపే కాలం గతించిపోయిందని, వెనిజులాకు చెందిన క్రూర యుద్ధ నేరస్థుడైన ఇలియట్ అబ్రామ్స్‌తో గొంతు కలుపుతూ, అంతకంటే దృఢంగా అమెరికా దేశ ప్రత్యేక రాయబారి పేర్కొన్నాడు.

మొత్తంగా ఈ సంక్షోభమంతా అంతర్గత యుద్ధానికి దోవతీసే తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభానికి వేదికను ఏర్పాటు చేస్తున్నది. దిగ్బంధం, ఆంక్షలనేవి దీర్ఘకాలంగా కొనసాగుతూ వెనిజులా చమురు ఎగుమతి ఆర్థిక వ్యవస్థను వాస్తవానికి సర్వనాశనం చేశాయి. చట్టా వ్యాపారులు, ఆహార సూపర్‌మార్కెట్ల యజమానులు ఆహార కొరతను సృష్టించి, ధరలు పెంచి ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తున్నారు. ఆహార కొరతను సాకుగా చేసుకొని, వెనిజులా ప్రజలకు 'మానవత్వంతో సాయం' అందిస్తామంటూ అమెరికా ప్రచారం చేసుకుంటున్నది. టన్నుల కొద్దీ అమెరికా 'సహాయం' వెనిజులా సరిహద్దుల్లోని కొలంబియాలో పోగుపడుతోంది. ఈ సరఫరాలు దేశంలోకి ప్రవేశింపనీయకుండా నిరోధించటానికి మదురో చేసే ప్రయత్నాలను ధిక్కరించేందుకే స్వయం ప్రకటిత అధ్యక్షుడు గుయిడో కంకణం కట్టుకున్నాడు. వెనిజులా కష్టాలకు అమెరికా ఆంక్షలు కారణమని మదురో ఆరోపిస్తున్నాడు. అమెరికా అందజేసే ఆహార సహాయం గురించి మాట్లాడుతూ, దీనిలో కనబడని ప్రమాదం పొంచి వుందన్నాడు. కుళ్ళిన, కలుషిత ఆహారాన్ని పంపిస్తూ వారు బడాయి ప్రదర్శన చేస్తున్నారన్నాడు. 3 వేల కోట్ల డాలర్ల దేశ సంపదను దొంగిలిం చినవారు, నాలుగు ట్రక్కుల కుళ్ళిన ఆహారాన్ని అందిస్తామంటున్నారని ఆయన పేర్కొన్నాడు. వారు నిజంగా వెనిజులాకు సహకరించా లనుకుంటే దిగ్బంధాన్ని ముందు ఎత్తివేయాలని, స్థంభింపజేసిన తమ బ్యాంకు ఖాతాలను విడుదల చేయాలని ఆయన పేర్కొన్నాడు.

వాస్తవానికి మానవత్వపు సహాయంగా పిలవబడేది మదురోకు, అతని ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజకీయ సాధనంగా ఉపయోగించ టానికేననేది స్పష్టం.

వెనిజులా దేశంలో ఇప్పటికీ తప్పకుండా వుండిపోయిన అపార చమురు నిక్షేపాలున్న కారణంగా అమెరికా ప్రభుత్వం ఇప్పటికే వెనిజులాలో తమ అనుకూల రాజకీయ పరిణామాల కోసం భారీగా ఖర్చు చేసిందని ట్రంపు యొక్క అనుచరగణంలోని ఉన్నతాధికారి, నేషనల్ సెక్యూరిటీ సలహాదారు అయిన జాన్ బోల్టన్ బహిరంగంగా అంగీకరించాడు. సహజ వాయువు, బంగారం, ఇతర సహజవనరులతో పాటుగా చమురు నిక్షేపాలను అత్యధికంగా కలిగి వున్నదిగా నిరూపితమైన దేశం వెనిజులా. వెనిజులా రాజకీయ సంక్షోభంలో అమెరికా సామ్రాజ్యవాదానికి అధిక వాటా కలిగి వుండటానికి ఇదే వాస్తవిక కారణం. అయితే మానవత్వపు

సహాయం, ప్రజాస్వామ్య పునరుద్ధరణ, మదురో నిరంకుశపాలన, మానవహక్కుల హరణం, ఆహారదాడులకు అంతం, వలసల సంక్షోభానికి ముగింపు వంటివన్నీ వెనిజులా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకునేందుకు అమెరికా చెబుతున్న కొన్ని సాకులు మాత్రమే.

'ప్రైవట్ లాటిన్ అమెరికా' విధానంలో భాగంగా వెనిజులాలో ప్రభుత్వాన్ని మార్చాలనే తన ప్రయత్నాలను అమెరికా తీవ్రం చేస్తోంది. ఈ విధానం యొక్క లక్ష్యమేమంటే దక్షిణ అమెరికా దేశాలపై రష్యా, చైనాల ప్రభావాన్ని సంపూర్ణంగా తొలగించటం, యావత్ దక్షిణ అమెరికా ఖండంలోని దేశాలన్నింటినీ కారుచౌకగా శ్రామికులను ఉత్పత్తిచేసే కేంద్రాలుగా మలచటంతో పాటు విలువైన వనరులు కలిగిన ఈ దేశాలన్నింటినీ అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహం చేసుకోవటమేననేది స్పష్టం.

ఈ వెలుగులో, స్వయం ప్రకటిత అధ్యక్షుడు, అమెరికా తొత్తు అయిన గుయిడో ఆర్థిక కార్యక్రమాన్ని మనం చూడవచ్చు. (అతను అధికారికంగా ఇప్పటికీ వెనిజులా అధ్యక్షుడు కాదు) గుయిడో ఇప్పటికే విద్యుత్తు, ఉక్కు, టెలికమ్యూనికేషన్స్, సిమెంట్ వంటి జాతీయం చేయబడిన కంపెనీలన్నింటినీ ప్రైవేటీకరిస్తామని, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమి సంపద లన్నింటినీ ప్రైవేటీకరిస్తామని, బహుళజాతి కంపెనీలకు అత్యంత అనుకూల పద్ధతుల్లో చమురు పరిశ్రమరంగాన్ని వారికోసం బార్లా తెరిచి వుంచుతామని తన కార్యక్రమంలో ప్రకటించాడు. ప్రభుత్వరంగంలో పనిచేసే కార్మికులను గంప గుత్తగా తొలగించటం, విద్యా, వైద్యరంగాలను ప్రైవేటీకరించటం కూడా గుయిడో విధానంలో భాగమే. సామాజిక, ఆర్థిక క్షేత్రాలలో బహుశా ఇవన్నీ బహిరంగ ప్రతీకారచర్యలు కావచ్చు. వెనిజులా సమాజంలో చెప్పుకోదగిన సంఖ్యలోని బహుళజాతి కంపెనీల, విశాల భూఖండాల యజమానుల, ఆయిల్ కంపెనీల అధిపతులు మరియు అమెరికా అనుకూల కులీనవర్గాలు, ప్రధానంగా శ్వేతజాత్యహంకార విభాగాల మద్దతు గుయిడోకుంది.

వెనిజులా దేశంలో అమెరికా జోక్యం చేసుకోవటం, అంతర్జాతీయ న్యాయసూత్రాలను బరితెగించి ఉల్లంఘించినదానికి మరో స్పష్టమైన ఉదాహరణ. ఒక సార్వభౌమాధికార దేశపు ఆంతరంగిక వ్యవహారాలలో ఈ రకపు చొరబాటు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరింపరానిది. 1998 నుండి వెనిజులా దిశగా తన దీర్ఘకాలిక దురాక్రమణ వ్యూహంలో భాగమైన ప్రస్తుత పరిణామాలు ఖచ్చితంగా చాలా తీవ్రమైనవి. 1998లో వెనిజులా అధ్యక్షునిగా హ్యూగో ఛావెజ్ ఎన్నికైనప్పటినుండి ఆ దేశంలో ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయటానికి అమెరికా ప్రయత్నాలు సాగిస్తోంది.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటం కోసమే తమ ఈ చర్యలని నాటి నుండి నేటివరకు అమెరికా అధ్యక్షులుగానున్నవారంతా ప్రకటించుకుంటూ వున్నప్పటికీ, ఆ దేశంలో వారి జోక్యం సాధారణంగా సైనిక నియంతృత్వపాలనకు, పెద్ద సంఖ్యలో ప్రజల ప్రాణనష్టానికి, గందరగోళానికి, అరాచకానికి మరియు అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాలకు ఆ దేశ ఆర్థికవ్యవస్థను లోబరచ టానికే దారితీస్తున్నది. కనుక ప్రజాస్వామ్యం గురించి చెప్పేవన్నీ శుద్ధ అబద్ధాలే. ఈ దేశాల ఆర్థికవ్యవస్థలలోని కీలకమైన సహజవనరులపై అదుపు ద్వారా అమెరికా అంతులేని దోపిడీ చేసుకోవటానికి, లాభాలను పొందటానికి ప్రయత్నిస్తోంది. కనుక, ఏవైతే దేశాలు అమెరికాకు దాసోహం కావటానికి ఇష్టపడకుండా తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవటానికి ప్రయత్నిస్తాయో, ఆ దేశాలన్నిటిని అమెరికా వేటాడుతుంది.

21 శతాబ్ది ప్రారంభం నుండి అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై ఏకైక ఆధిపత్య దేశంగా ఆవిర్భవించింది. సమకాలీన ప్రస్తుత ప్రపంచ రాజకీయాలలో అమెరికా సామ్రాజ్యవాదం ఇరాక్, ఇరాన్, లిబియా, సిరియా, యెమన్, ఉత్తరకొరియా, క్యూబా, వెనిజులా వంటి దేశాలను దుష్టదేశాలుగా ముద్రలు వేసింది. ఈ దేశాలన్నీ చమురు సమృద్ధంగా వున్న దేశాలు. అలాగే అమెరికా ఆదేశాలకు లోబడటానికి సిద్ధంగాలేవు. అమెరికా ఆర్థికవ్యవస్థ దిగజారుతూ వుండటం, అంతర్జాతీయ మారకంగా 1970ల నుండి కొనసాగుతూ వస్తున్న డాలర్, తన ప్రాభవాన్ని కోల్పోతూ వుండటం వంటివి ఈ సందర్భంలో పేర్కొనాలి. అమెరికా ఆర్థికవ్యవస్థ రక్షణకోసం నాటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ 1973 సం॥లో సౌదీ అరేబియా పాలకులతో ఒక ఒప్పందం చేసుకున్నాడు. ఇది పెట్రో-డాలర్ ఒప్పందంగా ప్రాచుర్యం పొందింది. దీని ప్రకారం సౌదీ అరేబియా ప్రపంచంలోని దేశాలకు డాలర్ ద్రవ్య మారకంతోనే పెట్రోలు ఎగుమతి చేయాలి. దీనికి బదులుగా అమెరికా సౌదీ అరేబియా రాజుకు ఆయుధాలను పంపటమేగాక, వారికి భద్రతను కల్పిస్తుంది. తదనంతర కాలంలో అనేక చమురు ఎగుమతి దేశాలు అమెరికా సామ్రాజ్య వాదుల వత్తిడి కారణంగా ఈ ఒప్పందంలో భాగమై, అమెరికా దుష్ట క్రీడా వ్యూహంలో పావులుగా మారాయి. ఏ దేశమైనా ఈ ఒప్పందాన్ని అమలుచేయకుండా వుండేందుకు ప్రయత్నిస్తే, అమెరికా సామ్రాజ్యవాదుల ఆగ్రహానికి గురికావలసి వస్తోంది. అది ఒకసారి ఇరాక్, మరోసారి లిబియా, యెమన్, సిరియా కావచ్చు. ప్రస్తుతం అది వెనిజులా, ఇరాన్ దేశాలు. అమెరికా సామ్రాజ్యవాదం తన ఆర్థిక ఆధిపత్యాన్ని కాపాడు కునేందుకు, తన మాటను ధిక్కరించిన దేశాలపై అనేకసార్లు సైనిక ఆధిపత్యాన్ని ప్రయోగించింది. గత 20 సం॥ల కాలంలో ప్రపంచ ప్రజానీకం ఈ తరహా అనేక దురాక్రమణ యుద్ధాలను చూశారు.

ఛావెజ్ అధికారంలోకి వచ్చిన తర్వాత, అప్పటివరకు బహుళజాతి కార్పొరేషన్ల అధీనంలో నున్న చమురు క్షేత్రాలన్నింటినీ ప్రభుత్వం జాతీయం చేసింది; విద్య, వైద్యం, అందరికీ ఆహారం కార్యక్రమాలను సబ్సిడీపై అందించేందుకు పెట్రోలు ఎగుమతులను వినియోగించింది. ఈనాడు వెనిజులా ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు కంపెనీ పిడివిఎస్ఏ, విద్యుత్తు కంపెనీలోని ఏదేని జాయింట్ వెంచర్‌ను అదుపు చేయగలిగిన వాటాలను కలిగివుంది. వెనిజులా క్రమంగా రష్యా, చైనాలతో తన ఆర్థిక, సైనిక, ద్వైపాక్షిక ఒప్పందాలను బలోపేతం చేసుకుంది. అమెరికా ప్రయోజనాలను ఖాతరు చేయలేదు. గత 20 సం॥ల కాలంగా వెనిజులాలో చట్టబద్ధంగా ఎన్నికైన ఛావెజ్‌ను మొదట, ప్రస్తుతం మదురో ప్రభుత్వాలను కూలదోయటానికి అమెరికా ప్రయత్నిస్తోంది. తన వెనుకనే ఇతర ఆర్థిక, సైనిక శక్తుల ఉనికి పెరగటాన్ని అమెరికా సామ్రాజ్యవాదం సహించలేకపోతోంది.

2002 సం॥లో జార్జి డబ్ల్యు బుష్ నాటి వెనిజులా అధ్యక్షుడు ఛావెజ్‌ను కూలదోయటానికి తిరుగుబాటును ప్రేరేపించాడు. వెనిజులా సమాజంలోని అంతులేని కార్మిక ప్రజారాశుల, దేశ ప్రజానీకపు మద్దతు కారణంగా ఛావెజ్‌ను కూలద్రోసే ప్రయత్నం ఘోరంగా విఫలమైంది.

ఒబామా పాలనా కాలంలో వెనిజులాలోని కీలక పరిశ్రమలపై ఆర్థిక ఆంక్షలను బిగింపు చేశారు. ప్రస్తుత సామాజిక సంక్షోభం, అశాంతికి ఈ ఆంక్షల విధింపు కారణంగా వుంది. ఈ ఆర్థిక, ద్రవ్యపరమైన దిగ్బంధనాలన్నీ సైనిక జోక్యానికి ముందస్తు చర్యలు మాత్రమే. 'లాటిన్ అమెరికా జియో పొలిటికల్ స్ట్రాటజీ సెంటర్' (సిఇఎల్‌ఏజి) ప్రకారం, అమెరికా ప్రధానంగా చేపడ్తున్న ఆర్థిక దిగ్బంధనం, బాయ్‌కాట్‌ల వంటి విధానాలను అమెరికా, దాని మిత్రకూటమి దేశాలు వెనిజులాపై విధించి అమలుచేసిన ఫలితంగా 2013, 2017 సం॥ల మధ్య కాలంలో సంవత్సరానికి 2200 కోట్ల డాలర్లను వెనిజులా నష్టపోయింది. పెట్రోలు ఎగుమతుల ద్వారా లభించే ఆదాయంతో తనకు అవసరమైన వస్తువులను ప్రధానంగా దిగుమతి చేసుకోవటంపై వెనిజులా అధికంగా ఆధారపడి వున్న కారణంగా, ఈ దిగ్బంధాలు, ఆంక్షలు, బహిష్కరణలు ఆ దేశ ఆర్థికవ్యవస్థపై ఘోరమైన ప్రభావాన్ని చూపాయి. ఈనాటి వలసల సంక్షోభంతోసహా ఆర్థిక, సామాజిక సంక్షోభం, వంటి వాటన్నిటికీ ఈ పరిస్థితులే కారణం. ఇదిలా వుండగా, ప్రపంచ చమురు ధరలు నిలకడగా తగ్గుతూ వస్తూండటం కూడా వెనిజులా ఆర్థికవ్యవస్థపై దుష్ప్రభావాన్ని కలిగించింది.

మరోవైపున, వెనిజులా దేశీయ ఆర్థిక వ్యవస్థలో అధికభాగమైన మౌలిక ఆహారగొలుసు వ్యవస్థ (స్థానిక ఉత్పత్తి నుండి సూపర్‌మార్కెట్ స్టోర్‌లకు ఇతరదేశాల నుండి దిగుమతి చేసుకునే వరకు) ఎంప్రిసాస్ పోలార్ అనే పెప్సీ అనుబంధ సంస్థ అయిన బహుళజాతి కార్పొరేషన్లపై ఆధారపడి వుంది. వండుకోవటానికి సిద్ధంచేసిన మొక్కజొన్న పిండిని 50 నుండి 60 శాతం ఈ కార్పొరేషన్లే అదుపుచేస్తాయి. దీనితోపాటుగా చెప్పుకోదగిన స్థాయిలో దేశంలోని ఆహారవ్యవస్థను పాతకాలపు తోటల వ్యవస్థకు చెందిన శ్వేతజాతి వారు అదుపు చేస్తుండటం కూడా ప్రస్తుతం ఆహార వస్తువుల ధరల పెరుగుదలకు, ఆహార సంక్షోభానికి కారణాలుగా వున్నాయి.

ఈ మొత్తాన్ని పరిగణలోకి తీసుకుంటే, వెనిజులాలో అంతర్యుద్ధానికి గడువు తీరిపో యిందని భావించవచ్చు. గత డిసెంబరులో మదురో మాస్కో పర్యటన సందర్భంగా వెనిజులా, రష్యా దేశాలు వందల కోట్ల డాలర్ల వ్యాపార ఒప్పందాలను చేసుకోవటంతో అమెరికా తాజాగా ఈ చర్యలకు పూనుకుంది. చమురు వెలికితీత, గనుల తవ్వకం, ఆయుధాల అమ్మకాల వంటి లాభదాయక ఒప్పందాలను వెనిజులాతో రష్యా కలిగివుంది. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక కూటమిలో భాగంగా రష్యాకు చెందిన 'టోపోలెవ్ టివి–160' అనే రెండు అణ్వస్త్ర బాంబర్లు రష్యాతో వ్యాపార ఒప్పందం జరిగిన వెంటనే వెనిజులా చేరుకోవటంతో మదురో ప్రభుత్వాన్ని కూలదోయాలని అమెరికా ఆకస్మిక నిర్ణయానికి వచ్చింది.

రష్యా, చైనాలు రెండూ మదురో ప్రభుత్వానికి తమ మద్దతును తెలిపాయి. అయితే వారి మద్దతు వారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు భంగం కలుగుతుందన్న దాని నుండి మాత్రమే కాదు. వెనిజులా ఆర్థికవ్యవస్థలో 2000 కోట్ల డాలర్ల పెట్టుబడులను చైనా కార్పొరేషన్లు పెట్టడంతోపాటుగా గత కొద్ది సం॥లుగా చైనా 5000 కోట్ల డాలర్లను, రష్యా 1700 కోట్ల డాలర్లను రుణాలుగా అందజేసి వున్నాయి. ఇంతేగాక, అమెరికా సామ్రాజ్యవాద పక్కలోనే తమ అనుంగు దేశంతో బంధాన్ని బలోపేతం చేసుకోవటానికి ఇరుదేశాలూ ఆసక్తిగా వున్నాయి.

ఈ మధ్య కాలంలో రష్యా, ప్రస్తుత సంక్షోభానికి ఒక శాంతియుత పరిష్కారాన్ని ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో ప్రతిపాదిం చటమేగాక, విదేశీ శక్తులు లేదా దేశాలు వెనిజులాను బెదిరిస్తూ చేసే హెచ్చరికలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేసింది కూడా. వెనిజులా దేశంలోని ప్రభుత్వానికి, విపక్షానికి నడుమ మెక్సికో, ఉరుగ్వే, బొలీవియా మరియు 'కరేబియన్ రాజ్యాల సమూహం' ద్వారా చర్చల యంత్రాంగాన్ని ముందుకు తీసుకెళ్ళే శాంతి క్రమం సాగుతోంది.

దేశీయంగానూ, అంతర్జాతీయంగానూ వెనిజులా ఎదుర్కొంటున్న పరిస్థితి వేగంగా క్షీణిస్తోంది. సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యం, పోటీ రోజురోజుకీ పదునెక్కుతున్నాయి. ఇలాంటి సున్నితమైన పరిస్థితులలో వెనిజులా ప్రభుత్వం అనుసరించటానికి చాలా కొద్ది అవకాశం మాత్రమే మిగిలింది. అమెరికా సామ్రాజ్యవాదం ముందు సాగిలబడి, వారి ఆదేశాలను శిరసావహిస్తూ, తమ దేశాన్ని దోపిడీ చేసుకొని, కొల్లగొట్టుకెళ్ళటానికి అంగీకారం తెల్పడం ఒక మార్గం, కాగా మరో మార్గం – అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా కార్మికులను, రైతాంగాన్ని సమాజంలోని ప్రజాస్వామ్య, ప్రగతిశీలురందరినీ సమీకరించి దృఢంగా నిలవటం.

గతంలో అనేక పర్యాయాలు అమెరికా సామ్రాజ్యవాద సవాళ్ళను ధీటుగా ఎదుర్కొని, దేశాన్ని రక్షించిన విప్లవకర కార్మిక ప్రజానీకం, రైతాంగంపై ఆధారపడటమే ప్రస్తుత తిరుగుబాటును ఓడించటానికి వెనిజులాకున్న ఒకే ఒక్క మార్గం.

వెనిజులా ప్రజానీకం ముందు మరేవిధమైన రాజీమార్గమూ లేదు. వెనిజులా భవితవ్యంతో ఆటలాడేవిధంగా అమెరికా సామ్రాజ్యవాదానికి కొన్ని రాయితీలివ్వటం లేదా రష్యా వంటి ఇతర సామ్రాజ్యవాద దేశాలకు లోబడటమనే – రెండు మార్గాలూ వెనిజులా ప్రజలకు అవమానకరమైనవీ, వారిని సామ్రాజ్యవాదులకు లోబరిచేవే. అమెరికా సామ్రాజ్యవాదమైనా, రష్యా సామ్రాజ్యవాదమైనా దోపిడీ చేసుకోవటం, కొల్లగొట్టటం, ఆధిపత్యం చెలాయించటం, యుద్ధాలు సాగించటం వారి నైజం.

బాహ్య శక్తుల ప్రమేయం లేకుండా తమ భవితవ్యాన్ని నిర్ణయించుకునే హక్కు వెనిజులా ప్రజలకుంది. సామ్రాజ్యవాద బంధనాల నుండి విడివడి, తమ అభివృద్ధితో ముందుకు సాగే హక్కు వెనిజులా ప్రజలకుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ధీరోదాత్తంగా నిర్వహించిన వీరోచిత చరిత్ర వెనిజులా ప్రజలకుంది. వెనిజులాలో నెలకొన్న ప్రస్తుత గందరగోళ పరిస్థితుల్లో ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యవాద వ్యతిరేక, శాంతికాముక ప్రజానీకమంతా వారికి మద్దతుగా వున్నారు.

OOOO